క్లుప్తంగా

స్టడీ మెటీరియల్స్‌కు విరాళం

పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురుకుల పరీక్షకు సంబంధించి గ్రామానికి చెందిన డీఎఫ్‌ఐ నాయకులు కమలాకర్ వారి సోదరుడు ప్రతాప్ జ్ఞాపకార్థం రూ.2,500 శనివారం పాఠశాల హెచ్‌ఎం లక్ష్మిదేవికి నగదు అందజేశారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థుల చదువు కోసం ప్రతి సంవత్సరం తమ సోదరుడి జ్ఞాపకార్థం ఆర్థిక తోడ్పాటునందిస్తానని కమలాకర్ పేర్కొన్నారు.

పాన్‌గల్ ఏఓగా రాజేందర్‌రెడ్డి



పాన్‌గల్: మండల నూతన వ్యవసాయ అధికారి (ఏఓ)గా రాజేందర్‌రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా విధులు నిర్వహిస్తున్న సాజీద్‌రహమాన్ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలానికి బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో నూతన ఏఓగా రాజేందర్‌రెడ్డి మండలానికి వచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పాన్‌గల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శాగాపూర్ శివారులో శనివారం తెల్లవారుజామున పోలీసులు గస్తీ తిరుగుతుండగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆపగా.. ట్రాక్టర్‌ను అక్కడే వదిలి డ్రైవర్ పారిపోయాడన్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి వివరాలు ఆరా తీయగా మండలంలోని చిక్కేపల్లికి చెందిన చింతకాయల ఛత్రపతి ట్రాక్టర్‌గా గుర్తించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

బాల్య వివాహం సామాజిక రుగ్మత



వనపర్తిటౌన్: బాల్య వివాహాలు సామాజిక రుగ్మతగా మారిందని, దీని నిర్మూలనకు సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రతి జిల్లాకు ఓ అధికారిని తక్షణం ప్రభుత్వం నియమించాలని రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్డీఎస్) ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో బాలికలు విద్యాపరంగానే కాకుండ ఆరోగ్యంగా క్షీణిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టును అమలు చేసి కేవలం బాల్యవివాహాల నియంత్రణకే పని చేస్తే అతి కొద్ది రోజుల్లోనే బాల్య వివాహ రుగ్మత జాడ కనిపించకుండ పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో వనపర్తిలో 3.18లక్షల మందితో బాల్యవివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించామని వెల్లడించారు. 420 అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బాల్య వివాహాలను అరికట్టడంలో భాగస్వాములుగా ఉంటామని హామీ పత్రాలు తీసుకున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో కన్నన్‌కుమార్, రాజశేఖర్, చంద్రశేఖర్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు రిపేర్: నడకదారిలో విద్యార్థులు



కొత్తకోట రూరల్: మండలంలోని అమడబాకుల శివారులో గల మోడల్ స్కూల్, కాలేజీలో దాదాపు 600మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. కొత్తకోట బస్టాండ్ నుంచి మోడల్ స్కూల్‌కు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు మూడు ట్రిప్పులు తిరుగుతుంది. శనివారం సాయంత్రం స్కూల్ వదిలిన తర్వాత స్కూల్ నుంచి విద్యార్థులను ఎక్కించుకొని వచ్చిన బస్సు మథర్‌థెరిస్సా జంక్షన్ సమీపంలో చెడిపోయింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్లు నడిచారు. అంతే కాకుండా స్కూల్ వద్దే కొందరు విద్యార్థులు ఉండిపోయారు. ఆర్టీసీ బస్సు రాకపోవడంతో వాళ్లు అమడబాకుల నుంచి కొత్తకోటకు నడవాల్సి వచ్చింది. ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అమడబాకుల మోడల్ స్కూల్‌కు వెళ్లే బస్సును పూర్తి కండీషన్‌లో ఉన్న బస్సును నడపాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తల్లిదండ్రుల సహకారమే ముఖ్యం



కేతేపల్లిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవింద్‌రావు

పాన్‌గల్: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించి, పిల్లలు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంఈఓ శ్రీనివాసులు తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మండలంలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలల్లో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించేలా తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల ప్రగతిపై సమావేశంలో చర్చించారు.

విద్యావ్యాప్తికి సహకరించాలి

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే వారి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరం అని జిల్లా విద్యా శాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కోఆర్డినేటర్ యుగేంధర్ అన్నారు. శనివారం మండలంలోని కల్వరాల, సంగినేనిపల్లి పాఠశాలలో తల్లిదండ్రులు, టీచర్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు చూడాలని, అలాగే ప్రతి పేరెంట్ తమ మొబైల్‌లో ఇంటింటా చదువుల పంట అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పిల్లలకు చూపించాలని ఆయన కోరారు. త్వరలో పాఠశాలలో జరిగే సమ్మెటివ్ అసైన్‌మెంట్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి నర్సింహ, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాజవర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రజలను చైతన్యం చేయాలి



మాట్లాడుతున్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య

పాన్‌గల్: సైబర్ క్రైం నివారణ, న్యాయ చట్టాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్యం చేయాలని లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య అన్నారు. శనివారం మండలంలోని బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, బాలకార్మికుల నిర్మూలన, సైబర్ మోసాలు, న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ చట్టాలను తెలుసుకొని ఏమైనా సమస్యలు తలెత్తితే పరిష్కరించుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆంజనేయులు, యాదగిరి, రఘు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, పీఎస్ హెచ్‌ఎం చెన్నప్ప, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ విజయమ్మ, సీఐటీయూ నాయకులు రాము, లోక్ అదాలత్ సంస్థ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేద్దాం



పాతపల్లిలో బీజేపీ సభ్యత్వాలు అందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

వనపర్తి రూరల్: క్షేత్ర స్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పెబ్బేరు మండలంలోని రంగాపురం, పాతపల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయనతో పాటు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ఇంటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ వారికి పార్టీ సభ్యత్వాలు అందించారు. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దేవేందర్ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, మాజీ అధ్యక్షుడు భగవంతుయాదవ్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి కుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు



ధర్మాపురం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కేశం నాగరాజ్‌గౌడ్



కొత్తకోటలో..

అమరచింత: మండలంలోని ధర్మాపురం, చంద్రగఢ్ స్టేజీ నుంచి నందిమళ్ల గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణ పనుల కోసం ప్రభుత్వం త్వరలోనే టెండర్లను ఆహ్వానిస్తుందని పంచాయతీ రాజ్ డీఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ధర్మాపురం స్టేజీ నుంచి గ్రామం వరకు గల రెండు కిలోమీటర్ల బీటీ రహదారి కోసం శనివారం సర్వే నిర్వహించారు. రహదారి వెంట అవసరమయ్యే కల్వర్టులపై అంచనా వేశారు. సర్వే పూర్తయిన వెంటనే రూ.రెండు కోట్లతో ధర్మాపురం రోడ్డు, రూ.1.40కోట్లతో నందిమళ్ల రోడ్ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. రహదారి సర్వే పరిశీలనకు వచ్చిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ రహదారి పనులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, కురుమూర్తి దేవస్థానం మాజీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి

కొత్తకోట రూరల్: మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పట్టణంలోని వీధులన్ని సీసీ రోడ్లు వేసేందుకు కృషి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం స్థానిక కాంగ్రెస్ నాయకులు మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం పట్టణంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. పట్టణంలో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు వేయాలి, డ్రెయినేజీలను నిర్మించాలని పూర్తి వివరాల నివేదికను తయారు చేయించారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బోయేజ్, గొల్లబాబు, నరేందర్‌రెడ్డి, పెంటన్నయాదవ్, మోహన్‌రెడ్డి, నరేందర్‌సాగర్, బాల్‌రెడ్డి, రాములుయాదవ్, ముజీబ్, దిలీప్‌రెడ్డి, శ్యామ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు మొండిచేయ్యి



మదనాపురంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కొత్తకోట చౌరస్తాలో..

కొత్తకోట రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వానాకాలం సీజన్ పూర్తవుతున్నా.. నేటికీ మొదటి విడుత డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం కొత్తకోటలో స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో పి.విశ్వేశ్వర్, చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, రాములుయాదవ్, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, అద్వానీ శ్రీను, అజ్జకొల్లు నర్సింహాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, వినోద్‌సాగర్ తదితరులు ఉన్నారు.

మదనాపురం: ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, మంత్రి తుమ్మల మాటలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యాదగిరి, చాంద్ పాషా, విజయేందర్‌రెడ్డి, మాసన్నయాదవ్, బోయ వెంకటేష్ నాయుడు, గన్నేపల్లి మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మాలల చైతన్య సభ



కదుకుంట్లలో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్‌లో జరిగే మాలల చైతన్య సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని జైభీమ్ సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మాల సభకు తరలిరావాలని కోరారు. మాలల హక్కుల పరిరక్షణకు చైతన్య సభలు రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్నాయని, అందులో భాగంగానే అక్టోబర్ 21న వనపర్తికి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సహదేవ్, నాయకులు నాగరాజు, కర్నె త్యాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 27న జరిగే మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి మదిలేటి అన్నారు. శనివారం ఆయన మండలంలోని చిట్యాల, కదుకుంట్లలో మాలల ఆత్మగౌరవ సభ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బిజ్జ సహదేవుడు, మండల అధ్యక్షుడు దాసరి విజయకుమార్, బర్కం రమేష్, బర్కం చెన్నకేశవులు, దాసరి కురుమూర్తి, వెంకటేష్, చిన్నదాసు, దాసరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సీఎం కప్ కరాటే సెలక్షన్ పోటీలో ఆత్మకూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి అరవింద్ ప్రతిభను కనబర్చాడు. శనివారం జరిగిన అండర్ 14, 72 కేజీల విభాగంలో అరవింద్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాడని, సంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని కరాటేమాస్టర్ నరేందర్ తెలిపారు. ఈసందర్భంగా అరవింద్‌ను సీనియర్ కరాటే మాస్టర్లు అబ్దుల్‌నబీ, విజయ్‌కుమార్, రాము, శివ, హరీష్, సురేందర్‌రెడ్డి, నరేందర్‌జీ అభినందించారు.

ఇఫ్టూ విలీన సభకు తరలిరండి

పాన్‌గల్: ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాన్ని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ)లో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే విలీన సభకు జిల్లా నుంచి ఐఎఫ్‌టీయూ నాయకులు, అనుబంధ కార్మిక సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఇఫ్టూ జిల్లా నాయకులు సుబ్బయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద విలీన సభ వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక సంఘాలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంటయ్య, రాజు, బాలయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో 2024–25 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి త్వరలో నిర్వహించే సోషల్ ఆడిట్‌కు అన్ని రికార్డులను సిద్ధం చేసుకోవాలని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువు తీరిన జాబ్‌కార్డుల స్థానంలో నూతన జాబ్‌కార్డులు ఇప్పించడం, 7 రకాల రిజిస్టర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాటిన హరితహారం మొక్కలలో ఎండిన వాటిన స్థానంలో నూతన మొక్కలు నాటి వంద శాతం మొక్కలు ఉండేలా చూడాలన్నారు. 2025–26 సంవత్సరానికి మండలంలో నూతన పనుల గుర్తింపుపై నిర్వహించే గ్రామ సభల్లో రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహించే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులతో సమావేశం

మదనాపురం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో శనివారం మేనేజర్ అశోక్‌కుమార్ విశ్రాంత ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. 70ఏళ్ల లోపు ఉన్న విశ్రాంత ఉద్యోగులకు ఇన్సూరెన్స్ బ్యాంకు ద్వారానే చేయిస్తామని చెప్పారు. పెన్షనర్ల పిల్లల చదువుల కోసం, హౌసింగ్ లోన్లు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మదనాపురం, కొత్తకోట మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు ఎంకే కురుమన్న, టీకే కురుమన్న, కొండారెడ్డి, మనివర్ధన్‌రెడ్డి, నరసింహ, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'కురుమూర్తి' రోడ్డుకు మరమ్మతు చేయండి



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న కుతుబ్

అమరచింత: కురుమూర్తి స్వామి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్కడకు వెళ్లే రహదారికి వెంటనే మరమ్మతులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొంకన్‌వానిపల్లి మీదుగా కురుమూర్తి స్వామి జాతర వరకు ఉన్న కచ్చ రహదారి గుంతలమయంగా మారిందన్నారు. కొంకన్‌వానిపల్లి నుంచి అల్లీపూర్ వరకు భారీ వర్షాలకు రహదారి పూర్తి స్థాయిలో దెబ్బతిందన్నారు. కొంకన్‌వానిపల్లి, రంగాపురం శివారులో ఉన్న వ్యవసాయ పొలాలకు సైతం వెళ్లలేని పరిస్థితులలో రహదారి ఉందని, ఎక్కడ పడితే అక్కడ గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. అధికారులు జాతర సమయానికి రహదారి పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో సీపీఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీను, కృష్ణయ్య, మల్లేష్, లింగన్న పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

వీపనగండ్ల: శాస్త్రీయ పద్ధతులు అవలంభించడం వల్ల వేరుశనగ పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం పుల్గర్‌చర్ల శివారులో వేరుశనగ పంటలను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా మొలక కుళ్లు తెగులు, శనగ పచ్చపురుగు లేదా అద్దె పురుగులు వేరుశనగ పంటలను ఆశించి నాశనం చేస్తాయన్నారు. వాటి నివారణ కోసం వ్యవసాయ అధికారులు సూచించిన మందులనే వాడాలని రైతులకు సూచించారు. ప్రైవేటు ఎరువుల దుకాణాదారులు తమ ఇష్టానుసారంగా రైతులకు అందించే పురుగు మందులను వాడటం వల్ల దిగుబడులను కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మోహన్‌కుమార్‌రెడ్డి, రైతులు మహేష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల అమలులో జాప్యం తగదు'



మాట్లాడుతున్న విజయరాములు

అమరచింత: ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం మండల సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు చేశారు. ఎన్నికల హామీలలో భాగంగా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తొమ్మిది నెలలు అవుతున్నా పట్టించుకోవట్లేదని ధ్వజమెత్తారు. మహిళలకు నెలకు రూ.2,500, రూ.500లకే వంట గ్యాస్, రూ.రెండు లక్షల రుణమాఫీ, రూ.4వేల పింఛన్ వంటి హామీలు తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. హామీలు నెరవేర్చాలని ప్రజలు అడుగుతుంటే గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తున్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశ పాలనను కాదని కాంగ్రెస్ ప్రభుత్వానికి గద్దెనెక్కించారన్న విషయాన్ని వారు గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో అబ్రహం, పట్టణ కార్యదర్శి భాస్కర్, రవీందర్, గీతమ్మ, శ్యామ్‌సుందర్, కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కేతూరి కృష్ణవేణి డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పదవి చేపట్టి 11 నెలలు గడిచినా రూ.2,500 పథకం అమలు చేయలేదని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కలిగించినా సీట్లు ఉండటం లేదని ఆరోపించారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనంగా బస్సులు నడపాలని, పావలా వడ్డీకే మహిళలకు రుణాలు ఇవ్వాలని కోరారు. వితంతువులు దరఖాస్తు చేసుకొని మూడేళ్లు గడుస్తున్నా కొత్తగా పింఛన్లు ఇవ్వడం లేదని.. కేంద్రం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తీసుకొచ్చినా అమలు కావడం లేదని తెలిపారు. మహిళలు, యువతులు ఇంటా బయట వివక్షకు గురవుతున్నారని.. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, పట్టణ కమిటీ అధ్యక్షురాలు జయమ్మ, కో కన్వీనర్లు శిరీష, భూమిక తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

వనపర్తి రూరల్: నర్సరీల్లో మొక్కలు పెంచడంపైనే ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఎంపీడీఓ రాఘవ సూచించారు. శనివారం ఆయన మండలంలోని మెంటపల్లి పంచాయతీ, పాఠశాల, నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నర్సరీలో మొక్కల పెంపుదలకు పలు సూచనలు చేశారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు హాజరయ్యే విధంగా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు. గ్రామపంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.